# 'బట్కల్ భోజనం'

చాలా ఏళ్ల క్రితం, అప్పుడు శరీరంలో శక్తి బాగా ఉన్నప్పుడు నేనూ మిత్రుడు గోపాలకృష్ణ భట్టు దక్షిణ భారత యాత్ర సంకల్పించాం. యాత్రంటే బస్సులూ రైళ్లల్లో సర్వ సామాన్యం, ప్రతి ఎల్లయ్యా పుల్లయ్యా చేసేయగల్డు. మరి మనం చేస్తే భిన్నంగా ఉండాలికదా అని సైకిళ్ల మీద దక్షిణ భారత యాత్ర అని నిర్ణయించుకున్నాం.

'సైకిళ్ల మీదా? మీరా?' అనాశ్చర్యపోయినవాళ్లున్నారు. 'సెహబాష్' అని భుజం తట్టినవాళ్లూ ఉన్నారు.

సరే ఓ శుభోదయాన కర్నూలు నించీ రెండు సాదా అట్లాసు సైకిళ్ల మీద కావల్సిన కనీస సరంజామతో బయల్దేరాం. మొత్తం టూరును పకడ్బందీగా చిత్రించుకున్నాం. వేసుకున్న టైంటేబిలు ఎక్కడా తప్పలేదు. వేకువనే లేవడం స్నానాదుల తర్వాత అల్పాహారం, మధ్యాహ్నాం భోజన వసతి దొరికేవరకూ సైకిలు తొక్కడం. మధ్యాహ్నాం భోజనానంతరం ఓ గంట విశ్రాంతి, తిరిగి రాత్రి బసదొరికే వరకూ సైకిలు తొక్కడం. ఒకటి రెండుసార్లు రాత్రి బసదొరక్క మధ్యరాత్రి వరకూ సైకిలు తొక్కాల్సి వచ్చింది. సరే యాత్రను ఇరవైమూడు రోజుల్లో దిగ్విజయంగా ముగించాం. ఆ ఇరవైమూడు రోజుల్లో నేను ఎప్పటికీ మరిచిపోలేని సంఘటనలూ వ్యక్తులూ మెదడు పొరల్లో అట్లా పదిలం. అలాంటి జ్ఞాపకాల్లో యిది ఒకటి. సైకిలు యాత్రలో ముందు గోవా పూర్తిచేసుకుని కన్నడ రాజ్యంలోకి ప్రవేశించాం. కన్నడ రాజ్యం రెండుగా ఉంటుంది. ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ. దక్షిణ కన్నడ చాలా మంది యాత్రికులకు పరిచితమయి ఉంటుంది. ఉడిపి, బేలూరు, హళేబీడు వగైరా స్థలాలవల్ల.

ఉత్తర కన్నడ రాజ్యాన్ని కన్నడ దేశపు కాశ్మీరుగా పిలుస్తారు. మహాద్భుతమైన ప్రకృతి తన విరాడ్రూపంతో మనల్ని సమ్మోహితుల్ని చేస్తుంది.

అటు పడమటి కనుమల్లోని అరణ్య పరిమళం.

ఇటు పురాతన సముద్ర ఘోష. చాలాచోట్ల నేనూ భట్టూ స్థాణువులుగా మారి, బ్యాగులోని కెమెరా తీయడం కూడా మరచిపోయి అట్లా నిలబడిపోయేవాళ్లం.

పడమటి కనుమల ఎత్తుల్లోకి వెళుతూంటే ఉన్నట్టుండి ఓ కారుమేఘం కమ్మేస్తుంది. చిటిచిటి చినుకుల్తో మనల్ని తడిపి తడిమి వెళిపోతుంది. అది అక్షరానికందని అనుభూతి.

ఓ కొండ ఎక్కిన కష్టం.. మరుక్షణం సుడులు తిరుగుతూ కిందికి జారిపోతూన్నట్లు వెళ్ళిపోవడం... మా సైకిళ్ళకు రెక్కలొచ్చినట్టుండేది.

అక్కడక్కడా చిన్నచిన్న గుంపులుగా జనం... అరకొరగా అక్కడో ఇల్లూ ఇక్కడో ఇల్లూ....ఎక్కడో ఇట్లా, మనకు తెలీకుండానే చాలా వూళ్లు దాటిపోతాం.

సరే నేనసలు ప్రస్తావించిన జ్ఞాపకం గురించి మాట్లాడాలి.

అట్లా వెళ్తూవెళ్తూ ఓ రోజు భోజన సమయానికి 'బట్కల్' అనే వూరు చేరుకున్నాం సమయం మూడు దాటుతోంది. మధ్యాహ్న భోజనానికి కాలాతీతమయింది. భట్టు ఖచ్చితమైన శాకాహారి ఆ వూళ్లో తొంభైశాతం హైందవేతరులే. ఎక్కడా బ్రాహ్మణ భోజనం కనిపించలేదు.

సహచరుణ్ణి వదిలి నేను తినలేను. వాకబు చేస్తూ వెళితే ఎవరో ఓ పాత ఇంటిని చూపించారు.

'అక్కడ భోజనం దొరకవచ్చు'

అన్చెప్పారు.

మట్టి ఇల్లు...

గోడలు పెచ్చులు రాలి ఉన్నాయి.

ముఖద్వారం లాంటిది దాటిం తర్వాత లోపల విశాలమైన పెరడు. లోపలంతా మృత్తికా పరిమళమే. అంత విశాలమైన పెరట్లో ఓ పక్కకు రెండు గదులు.

లోపలికి తొంగిచూశాం నేనూ భట్టూ.

ఇద్దరు స్త్రీ మూర్తులు విస్తళ్లు వేసుకుని భోజనానికుపక్రమించబోతూ ఉన్నారు. మమ్మల్ని చూసి 'అయ్యో ఇక ఎవ్వరూ రారనుకొని ఉన్నది తినేస్తున్నామే' అని తుళు భాషలో బాధపడుతూ ఓ ఆవిడ అంది... మేం నిరాశపడి వెనుతిరుగుతుండగా ఆమే అంది "ఓ పది నిముషాలాగుతారా అన్నం వండుతాను. మిగిలిన కూరలూ మజ్జిగతోటే తినవచ్చు" అంది. ఆనందంగా తలలూపాము. ఆ ఇద్దరిలో చిన్నామె వచ్చి నుయ్యి చూపించింది. నీళ్లు తోడుకుని చల్లగా మొహాలకు చల్లుకుని విశాలంగా విస్తరించిన పనస చెట్టు నీడన సేదతీరాం.

అటు గోడ వారగా రెండు ఆవులు... గోమయం, గోమూత్ర సహితంగా మట్టివాసన. పాకుడు పట్టి ఆకుపచ్చటి మెరుపుతో మట్టిగోడలు. ఏదో వేరే లోకపు అనుభూతి. భోజనానికి పిలిచారు. అలికిన మట్టినేల...పచ్చి పనస ఆకుల్తో కుట్టిన విస్తళ్లు... కంచు చెంబుల్లో నీళ్లు... వేడివేడిగా పొగలు కక్కుతున్న ఎర్రబియ్యపు టన్నం. ఆదరువేమిటో చూసుకోలేదు. ఎంత తిన్నామో తెలియదు. వాళిద్దరూ ఎదురుగా కూచుని వడ్డిస్తూంటే, అన్నపూర్ణ రెండు రూపాల్తో ఎదురుగా కూచునున్నట్లు... తల్లీకూతుళ్ల అవతారమెత్తి... వాళ్ల

వేపు నిశితంగా చూసా, ప్రకృతి అతిదారుణంగా చిత్రించిన వైధవ్యం వాళ్ల ముఖాల మీద.

అయినా మొక్కవోని విశ్వాసంతో తమకు చేతనైనది ఒకే ఒక పని ఇతరులకు అన్నం పెట్టడం చేస్తూ, తిన్నవాళ్లు ఇచ్చింది ఎంతో కొంత తీసుకుని ధైర్యంగా పోరాటం సాగిస్తూ ఆ తల్లీకూతుళ్లు.

నాకిప్పటికి ఎప్పుడేనా విపరీతమైన ఆకలి కలిగితే బట్కల్ బోజనమూ, ఆ స్త్రీమూర్తులిద్దరూ చటుక్కున స్ఫురణకొస్తారు. ●